

## సైబర్ మోసానికి గురైన రిటైర్డ్ ఐఏఎస్

- రూ.3.37 కోట్లు బురిడీ కొట్టించిన నేరగాళ్లు

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాజా రత్నకిశోర్ ఆన్‌లైన్ సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.3.37 కోట్లు మోసపోయారు. ఈ వ్యవహారంపై రత్నకిశోర్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే 'ధని సెక్యూరిటీస్' పేరుతో దుండగులు మార్చిలో రత్నకిశోర్‌ను పరిచయం చేసుకున్నారు. మ్యూచువల్ ఫండ్స్, ఐపీవోలు, ఆప్షన్ ట్రేడింగ్‌తో సుమారు 120 నుంచి 160 శాతం వరకు లాభాలు వస్తాయని ఆశ చూపారు. ఇదంతా నమ్మిన రత్నకిశోర్ ట్రేడింగ్‌కు సుముఖత వ్యక్తం చేశారు. పెద్దఎత్తున పెట్టుబడి కింద పెట్టారు. అయితే రత్నకిశోర్‌కు రూ.25.91 కోట్ల లాభం వచ్చిందని సైబర్ నేరగాళ్లు చూపించారు. ఆ డబ్బులు తీసుకోవాలంటే 10 శాతం ఫీజు (రూ.2.23 కోట్లు) చెల్లించాలని చెప్పారు. మార్చి నుంచి మే వరకు 33 సార్లు జరిపిన లావాదేవీల్లో రూ.3.37 కోట్లు కొల్లగొట్టారు. ఒక్క రూపాయి కూడా తిరిగిరాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి, రత్నకిశోర్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

## ఎన్టీపీసీలో సమ్మెపై ఆరు నెలల నిషేధం

హైదరాబాద్, 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఎన్టీపీసీ విద్యుత్తు ప్లాంట్లలో సమ్మెలపై ప్రభుత్వం నిషేధం విధించింది. తెలంగాణ ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్-1971 ప్రకారం ఆరు నెలల పాటు సమ్మెలపై నిషేధాన్ని విధిస్తూ సోమవారం జీవోను జారీచేసింది. జూన్ 14 నుంచి ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ స్పష్టంచేశారు.

# పోలవరం కూలితే ఇజ్జత్ పోలేదా?

### ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చింది బీజేపీ కాదా?.. కాళేశ్వరంపై బండిది దుష్ప్రచారం: గంగుల

- అధికారంలో లేని కేసీఆర్‌ను దూషించడం విడ్డూరం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మైత్రికి సంజయ్ వ్యాఖ్యలే నిదర్శనం
- మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధ్వజం
- బండి సంజయ్‌కి చిత్తశుద్ధి ఉంటే తమ్మిడిహట్టికి అనుమతులు సాధించాలి: మాజీ ఎంపీ వినోద్



తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్. చిత్రంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

హైదరాబాద్ జూన్ 23 (నమస్తేతెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తే బీజేపీ ఇజ్జత్ పోయేదన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఘాటుగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇచ్చిన పోలవరం డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే ఇజ్జత్ పోలేదా? అని ప్రశ్నించారు. బండికి కనీస అవగాహన లేదు.. ఇంగితజ్ఞానం అంతకన్నా లేదు అంటూ తూర్పారబట్టారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి గంగుల విలేకరులతో మాట్లాడారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్లను రిపేర్ చేస్తే సరిపోతుందని ఎన్డీఎస్‌ఏ చెప్పిన విషయాన్ని విస్మరించి తప్పుడు మాటలు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. క్యాబినెట్ ఆమోదంతో పాటు అన్ని అనుమతులు ఉన్న కాళేశ్వరంపై సంజయ్ అనుమతులు లేవని, ఆ ప్రాజెక్టు నీళ్లతో పంటలు పండలేవని అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రి హోదాలో వివరాలు తెప్పించుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అవాకులు చవాకులు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు.

#### కాంగ్రెస్ సర్కారుకు బండి వత్తాసు..

తెలంగాణకు కల్పతరువులాంటి కాళేశ్వరంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే కమలాకర్ మండిపడ్డారు. లక్ష కోట్లు ఖర్చు కాని ప్రాజెక్టుకు లక్ష కోట్ల అవినీతి అంటూ అబద్ధాలు మాట్లాడుతున్నారంటూ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుకు బండి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఇంకా కేసీఆరే సీఎంగా ఉన్నారనే భ్రమలో ఆయనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బండి సంజయ్ వ్యాఖ్యలు వింటుంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీనా లేక బీజేపీనా అన్న అనుమానం కలుగుతున్నదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణలో కూడా మోదీతో యోగాసనాలు వేయిస్తే సరిపోయేది కదా అని ఎద్దేవా చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతం కరీంనగర్‌లోనే ఎక్కువ ఉన్నదనే సోయి లేకుండా కాళేశ్వరంపై సొల్లు కబుర్లు చెప్పడం, చిల్లర మాటలు మాట్లాడటం బండికే చెల్లిందని చురకలంటించారు. తమ్మిడిహట్టి దగ్గర 165 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదన్న సీడబ్ల్యూసీ నివేదికలో కొద్దిభాగం మాత్రమే చదివి వినిపించారని విమర్శించారు. ఆయన చూపిన పేపర్‌లోనే ఇతర రాష్ట్రాలకు 63 టీఎంసీలు కేటాయించామని, తెలంగాణ వాటా 44 టీఎంసీలు మాత్రమేనని ఉన్న విషయాన్ని విస్మరించారని ఆరోపించారు. ప్రాజెక్టుపై కనీస అవగాహనలేని బండి సంజయ్ అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని, రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1.24 లక్షల కోట్లకు పెంచారని చెప్పడం ఆక్షేపణీయమని అన్నారు.

#### అన్నీ ఆలోచించే మేడిగడ్డకు..

తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం సాధ్యంకాదని, అన్నీ ఆలోచించి, నిపుణులతో చర్చించిన తరువాతనే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్టింగ్ పాయింట్‌ను మేడిగడ్డకు మార్చారని గంగుల గుర్తుచేశారు. కేవలం రూ.96 వేల కోట్లు వెచ్చించి మూడేండ్లలో బృహత్తర ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చి తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని ప్రశంసించారు. గతంలో ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌లో.. కాళేశ్వరంలో అవినీతి జరిగిందా? జరిగితే ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని బీజేపీ సర్కారును ప్రశ్నించగా.. కేంద్ర మంత్రే అవినీతి జరగలేదనే సమాధానం చెప్పిన విషయాన్ని గంగుల గుర్తుచేశారు. కానీ ఇందుకు విరుద్ధంగా సంజయ్ మాట్లాడటంలోని అంతర్యమేమిటని, సీఎం రేవంత్ సూచనల మేరకే నడుచుకుంటున్నారా? సమాధానం చెప్పాలని ప్రశ్నల వర్షం కురిపించారు.

#### ఈటలతో ఉన్న పేచీతోనే అనుచిత వ్యాఖ్యలు: దాసోజు శ్రవణ్

సొంత పార్టీకి చెందిన ఎంపీ ఈటల రాజేందర్‌తో ఉన్న పేచీ కారణంగానే బండి సంజయ్ కాళేశ్వరంపై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ ఆరోపించారు. బీజేపీ నేతలందరూ సంకల్పసభ పెట్టుకొంటే హాజరు కాకుండా ముఖంచాటేసిన ఆయన కాళేశ్వరాన్ని తెరపైకి తెచ్చారని దుయ్యబట్టారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ఇస్తే పరువు పోయేదని సంజయ్ మాట్లాడటం విడ్డూరమన్నారు. ఈటలతో విబేధాలుంటే ఇద్దరు గల్లాలు పట్టుకొని కొట్టుకోవాలని, కానీ కేసీఆర్‌పై ఏడుపెందుకని ప్రశ్నించారు.

#### రేవంత్ స్క్రిప్ట్‌ను చదువుతున్నారు: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కేంద్రమంత్రి బండి సంజయ్ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు అండగా ఉంటూ కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విమర్శించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్‌ఏ రిపోర్టును వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఆయన సీఎం రేవంత్ రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతూ బీఆర్‌ఎస్‌పై నిందేలేస్తున్నారని ఆక్షేపించారు. బండికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రశ్నించాలని, ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయాలని అడగాలని డిమాండ్ చేశారు. అంతేగానీ ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.

### ద్వేషంతోనే కేసీఆర్‌పై విమర్శలు: వినోద్

**బండి సంజయ్** కేంద్ర మంత్రిలా కాకుండా సాధారణ కార్యకర్త మాదిరిగా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ దుయ్యబట్టారు. కేసీఆర్‌ను తిట్టేందుకే పుట్టినట్టు.. ద్వేషంతో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు మొదలుపెట్టకముందే ప్రాణహిత అంచనావ్యయాన్ని రూ.40 వేల కోట్లకు పెంచిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టి కేసీఆర్‌ను బద్నాం చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌కి చిత్తశుద్ధి ఉంటే తమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం, మహారాష్ట్రను ఒప్పించాలి.. ప్రాజెక్టుకు జా తీయ హోదా ఇప్పించాలి అని డిమాండ్ చేశారు. కేసీఆర్ మూడేండ్లలో కాళేశ్వరాన్ని కట్టి చూపారని, దమ్ముంటే కేంద్ర మంత్రులు తమ్మిడిహట్టికి అనుమతులు సాధించాలని సవాల్ విసిరారు. గతంలో మిడ్‌మానేరు కొట్టుకుపోతే కేసీఆర్ ఎవరినీ నిందించకుండా రిపేర్ చేయించారని గుర్తుచేశారు.

### ● ఎస్‌ఎల్‌బీసీ, సుంకిశాల ఘటనలపై విచారణేది?

**కాంగ్రెస్** ఏడాదిన్నర పాలనలో సుంకిశాల దెబ్బతిన్నది.. ఎస్‌ఎల్‌బీసీ కుప్పకూలింది.. వట్టెం మునిగిపోయింది.. పెద్దవాగు కొట్టుకుపోయింది.. ఇన్ని దుర్ఘటనలు జరిగినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదని గంగుల ప్రశ్నించారు. నాడు మేడిగడ్డ ఘటనపై ఆగమేఘాల మీద ఎన్డీఎస్‌ఏను పంపించిన మోదీ.. ఇప్పుడు ఎందుకు మిన్నకుంటున్నారు.. రేవంత్‌తో ఉన్న పవిత్రబంధమే ఇందుకు అడ్డొచ్చిందా అంటూ ఎద్దేవా చేశారు. ఇద్దరి మధ్య ఒప్పందంలో భాగంగానే విచారణ జరిపించడం లేదని ఆరోపించారు.

## గోబెల్స్ బాబూ.. ఏదీ మిగులు?



- ఆంధ్రా ముఖ్యమంత్రిని వదలని 3 వేల టీఎంసీల పైత్యం
- అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించే యత్నం
- తాజాగా 'ఏడాది పాలన'లోనూ అదే మాట వల్లింపు
- మిగులు బూటకమని జల సంఘం తేల్చినా మారని తీరు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పడం ద్వారా అది నిజమవుతుందనే చంద్రబాబు భ్రమ ఇప్పటిది కాదు! నాలుగు శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్‌ను తానే నిర్మించానంటూ నేటికీ ఆయన డాబును ప్రదర్శిస్తూనే ఉంటాడు. ఎందుకంటే.. ఏదో ఒక రోజు ఒక్కరైనా దీన్ని నమ్మకపోతారా? అనే అత్యాశ! తాజాగా గోదావరి జలాల పైనా గోబెల్స్ బాబు అదే భ్రమలో ఉన్నారు. ఓవైపు సాక్షాత్తూ కేంద్ర జల సంఘం, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ)తోపాటు సాగునీటి రంగ నిపుణులు సైతం మిగులు జలాలే లేవని బల్లగుద్ది చెప్తున్నా బాబు తీరు మాత్రం మారడం లేదు. తాజాగా సోమవారం 'ఏడాది పాలన' సందర్భంగా అమరావతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలోనూ సముద్రంలోకి పోయే 3 వేల వృథా జలాల్లో కేవలం 200 టీఎంసీలను వాడుకుంటూ బనకచర్లను చేపడుతున్నామంటూ అదే అబద్ధాన్ని పునరావృతం చేశారు. కేంద్ర జల సంఘం 1966-67 నుంచి 2012-13 వరకు వచ్చిన ఇన్‌ఫ్లోలను మదించి ఏడాదిలో కేవలం నాలుగు నెలల్లోనే 70-80 శాతం వరద ఉంటుందని తేల్చింది. మిగిలిన ఎనిమిది నెలల్లో కేవలం 20-30 శాతం వరద మాత్రమే ఉంటుందని స్పష్టంచేసింది. పైగా సరాసరిన ఏడాదిలో వచ్చే వరద 2638 టీఎంసీలు ఉంటుందని శాస్త్రీయంగా బయటపెట్టింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన మిగులు జలాలు లేకపోగా 157 టీఎంసీల లోటు ఉన్నదని ఎన్‌డబ్ల్యూడీఏ తేల్చగా అసలు మిగులే లేదని కేంద్ర జల సంఘం కూడా స్పష్టం చేసింది. ఇన్ని నివేదికలు, ఆధారాలు ఉన్నా చంద్రబాబు తీరు మారడం లేదు. పదేపదే అబద్ధాన్ని చెప్పి తన అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేయించే కుటిలయత్నం చేసి తద్వారా కేంద్ర అనుమతులతో బనకచర్ల అక్రమ ప్రాజెక్టును సక్రమం చేసుకోవాలని చూస్తున్నారు. ముఖ్యంగా గోదావరిలో భారీ ఇన్‌ఫ్లోలు ఉండే నాలుగు నెలలపాటు ఇటు తెలంగాణ గానీ, అటు ఏపీ గానీ నీటిని మళ్లించుకునే అవకాశం, అవసరం ఉండదు. బోర్డుల, అథారిటీల నియంత్రణలోకి గోదావరి ప్రాజెక్టులను తెచ్చి వాటి ద్వారా మిగిలిన ఎనిమిది నెలల్లో వచ్చే మోస్తరు, స్వల్ప ఇన్‌ఫ్లోలను కూడా సీమాంధ్రకు మళ్లించుకు పోతారనేందుకు కృష్ణా బేసిన్ అనుభవం కండ్ల ముందే ఉన్నది.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు






# సన్నాలకు బోనస్ బంద్

- ఇందిరమ్మ జాతీయభరోసా బంద్
- యువవికాసం అమలుకాకముందే బంద్
- కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్నీ బంద్
- హామీలు తీర్చకుంటే తిరుగుబాటే: హరీశ్



హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): 'ఆత్మశుద్ధిలేని యాచార మదియేల.. భాండశుద్ధి లేని పాకమేల? అన్నట్టుంది కాంగ్రెస్ పరిస్థితి' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సన్నాలకు బోనస్ బంద్, ఇందిరమ్మ జాతీయ భరోసా బంద్, రాజీవ్ యువ వికాసం అమలుకాకముందే బంద్.. ఇలా చెప్పుకుంటూ పోతే.. కాంగ్రెస్ పాలనలో అన్నీ బంద్ పెట్టారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ సర్కారు అమలుచేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని సోమవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. ప్రజలను నమ్మించడం, నయవంచన చేయడంలో కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గొర్రెల పంపిణీ చేస్తామని చెప్పారని, కానీ, గొర్రెల పంపిణీ దేవుడెరుగు, కట్టిన డీడీ పైసలు కూడా వాపస్ ఇవ్వలేని దుస్థితి నెలకొన్నదని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు విని విసిగిపోయిన యాదవ, కురుమ సోదరులు.. గాంధీభవన్‌కు గొర్రెలు తోలుకొచ్చి.. నిరసన తెలియజేశారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఏకమై.. గాంధీభవన్‌కు పోటెత్తకముందే కాంగ్రెస్ సర్కార్ కండ్లు తెరువాలని హితవు పలికారు. చెప్పిన గ్యారెంటీలు, ఇచ్చిన హామీలు ఇకనైనా అమలుచేయకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

#### మేడిగడ్డకు ఒక నీతి, సుంకిశాలకు ఇంకో నీతా?

మేడిగడ్డకు ఒక నీతి, సుంకిశాలకు ఇంకో నీతా? అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డకు చిన్న మరమ్మతులు చేసి, గోదావరి నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా.. బీఆర్‌ఎస్‌ను బద్నాం చేయాలనే సింగిల్ పాయింట్ ఎజెండాతో ముందుకెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. సుంకిశాల విషయంలో మాత్రం తమ లోపాలు ఎక్కడా బయటపడుతాయోనని, గుట్టుచప్పుడు కాకుండా రిపేర్లు మొదలుపెట్టిందని పేర్కొన్నారు. 'సుంకిశాల మీద.. ఎక్స్‌పర్ట్ కమిటీ ఎంక్వైరీ.. విజిలెన్స్ కమిషన్ విచారణ.. జ్యుడీషియల్ కమిషన్.. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు.. ఇలాంటివేమీ లేకుండానే, గుట్టుచప్పుడు కాకుండా, రిపేర్ చేయిస్తారు' అని విమర్శించారు. కానీ, అదే మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే అన్నీ కమిటీలు ఉంటాయని దుయ్యబట్టారు. ఎన్‌డీఎస్‌ఏతోపాటు ఎక్స్‌పర్ట్ కమిటీ, రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ వంటి వివిధ సంస్థలు.. కుంగిన పిల్లర్లను రిపేర్ చేయాలని అభ్యర్థించినా, నిర్మాణ కంపెనీ రిపేర్ చేయడానికి సిద్ధం అని చెప్పినా కూడా కేవలం రాజకీయ స్వార్థంతో తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టడం, కాంగ్రెస్ మార్కు 'ప్రజా వ్యతిరేక-ప్రతిపక్ష వేధింపు' పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

### ప్రారంభోత్సవానికి ముందురోజే కుప్పకూలిన ప్రహరీ

- బస్సు బంపర్ తాకడంతో కూలిన గోడ

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 23: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన బస్టాండు పరిస్థితి.. ప్రారంభానికి ముందే పంచనామా చేసినట్లయింది. డ్రైవర్ బస్సును రివర్స్ తీస్తున్న క్రమంలో వెనుక ఉన్న బంపర్ ప్రహరీకి తగలడంతో గోడ కుప్పకూలిపోయింది. అక్కడే ఉన్న పలువురు కేకలు వేయడంలో డ్రైవర్ బ్రేక్ వేశాడు. లేకపోతే బస్సు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టేది. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రహరీ కూలడంతో పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నూతన బస్టాండ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మదన్‌మోహన్ మంగళవారం ప్రారంభించాల్సి ఉన్నది. ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందే బస్టాండ్ ప్రహరీ కూలడం నిర్మాణంలోని డొల్లతనం బయటపడింది.



ఎల్లారెడ్డిలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన బస్టాండ్‌లో బస్సు బంపర్ తగలడంతో కూలిన ప్రహరీ



మలేషియా నుంచి స్వదేశానికి వచ్చిన కార్మికులతో మాట్లాడుతున్న ఖానాపూర్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్

## కేటీఆర్ చొరవతో మరో ముగ్గురికి విముక్తి

### మలేషియా నుంచి స్వదేశానికి యువకులు.. రామన్న, జాన్సన్‌నాయక్‌కు మనసారా కృతజ్ఞతలు

హైదరాబాద్ జూన్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో మలేషియా జైలు నుంచి మరో ముగ్గురికి విముక్తి లభించింది. ఆరుగురు బాధితుల్లో గతంలో ముగ్గురు విడుదలై స్వదేశానికి రాగా, సోమవారం మరో ముగ్గురు యువకులు సొంతూర్లకు చేరుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కడెం లింగాపూర్‌కు చెందిన రాచకొండ నరేశ్, గుండా శ్రీనివాస్, దస్తురాబాద్ మున్యాల్ గ్రామానికి చెందిన రవీందర్‌తోపాటు మరో ముగ్గురు చేయని తప్పుకు మలేషియాలోని జైలులో మగ్గారు. ఖానాపూర్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ వారి దయనీయ పరిస్థితిని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడారు. అలాగే పార్టీ లాయర్ల ద్వారా న్యాయసహాయం అందించి, గత నెలలో జాన్సన్ నాయక్‌ను మలేషియాకు పంపించారు. జాన్సన్‌నాయక్ మలేషియా, భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపారు. పలుమార్లు ఆయన విజ్ఞప్తి చేయగా అక్కడి జైలు అధికారులు విడుదలకు ఒప్పుకున్నారు. ఈ క్రమంలో గత నెలలో ముగ్గురు విడుదల కాగా, తాజాగా మరో ముగ్గురు సొంతూర్లకు చేరుకున్నారు.

#### బతికినంతకాలం రుణపడి ఉంటాం..

మలేషియా జైలు నుంచి విడుదలై సొంతూర్లకు చేరుకున్న రాచకొండ నరేశ్, గుండా శ్రీనివాస్, రవీందర్ భావోద్వేగానికి గురయ్యారు. దేశంకానీ దేశంలో అష్టకష్టాలు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. 'మలేషియాలోనే జీవితం అంతమైపోతుందని భావించిన మాకు కేటీఆర్, జాన్సన్‌నాయక్ అండగా నిలిచారు.. న్యాయవాదులను నియమించి మా దగ్గరకు వచ్చి విడిపించారు' అని తెలిపారు. బతికినంతకాలం వారికి రుణపడి ఉంటామని మనసారా కృతజ్ఞతలు తెలిపారు.


